# అంతా బాగానే వుంది

'ఇదేం పెద్ద జీవిత సమస్యా ఏమన్నానా?' అనుకున్నాడు వాసుదేవరావు చివరిగా ఒక నిర్ణయానికొచ్చి, మనసు తేలిక పరుచుకొని. నిజానికి వాసుదేవరావు జీవితంలో అది సమస్య కానే కాదు. కానీ రెండు నెలలుగా అది అతగాని మనసుని అతలాకుతలం చేసేస్తోంది. కూడు, గుడ్డ సమస్యలు అతనికి లేవు. నిరుద్యోగ సమస్య కాదు. పిల్లల చదువులూ, పెళ్ళిళ్ళూ అతనికి సమస్యలే కాలేదు. ఒక రకంగా గూడు సమస్యే అది!

పాతికేళ్ళ క్రితం అతనికీవూళ్ళో ఉద్యోగం వచ్చిన ఆరేళ్ళకు చవగ్గా వచ్చిందని స్వంత ఊర్లో ఉన్న కొద్దిపాటి పొలాన్నీ అమ్మేసి కొనుక్కున్నాడా ఇంటిని. ఊరికి కాస్త దూరమైనా తను పనిచేసే కంపెనీకి కాస్త దగ్గరే. నాలుగొందల చదరపు గజాల స్థలంలో ఓ చిన్న బొమ్మరిల్లు. చుట్టూ ప్రహరీ ఉంది. ఆ ఇంట్లోనే పిల్లల చదువులూ, పెళ్ళిళ్ళు జరిగాయి. ఆ ఇంట్లో ఉంటూనే కంపెనీ సర్వీసంతా చేశాడు. రిటైరయ్యాక కూడా 'తనకీ గూడు ఉండబట్టే గదా ఇంత హాయిగా ఉండగలిగేడు' అనుకున్నాడు.

అటువంటిది... ఓ చిన్న ఆలోచనే అతనికి సమస్యై కూర్చుంది.

వాసుదేవరావుది చిన్న కుటుంబం. భార్యా, ఇద్దరు పిల్లలు. కూతురు పెద్దది. బి.యస్సీ పూర్తి చేశాక ఏం చదవాలీ అని అనుకుంటున్నంతలో అమెరికా సంబంధ మొచ్చింది. అమ్మాయి తెల్లగా అందంగా పెద్దపెద్ద కళ్ళతో బావుంటుందేమో కట్న కానుకలు అక్కర్లేదన్నారు వాళ్ళు. అయినా, "అమెరికా సంబంధం మాకొద్దు అక్కడికెళ్ళిన వాళ్ళెవరు స్వదేశం తిరిగి రావటం లేదు. మాకున్నది ఒక్కత్తే అమ్మాయి. పరాయి దేశంలో ఎక్కడో ఉండడం మాకిష్టం లేదు" అన్నాడు వాసుదేవరావు సంబంధం తెచ్చినాయనతో. ఈ విషయంలో అతని భార్య సుగుణదీ అతని మాటే.

"మాకు ఒక్కడే అబ్బాయి. వెళ్ళి రెండేళ్ళయింది. మరో మూడేళ్ళు ఉంటాడక్కడ. తర్వాత ఇక్కడికే వచ్చేస్తాడు. మాకు మీ అమ్మాయి నచ్చింది కాబట్టి అడుగుతున్నాం. ఆలోచించండి." అన్నారు వాళ్ళు.

'సరే! మూడేళ్ళు ఎంతలో గడవాలి' అనుకుని ఆ సంబంధానికే ఒప్పుకున్నాడు.

పెళ్ళయ్యాక కూతురు అరుణ, అల్లుడు ఆనందరావు అమెరికా వెళ్ళిపోయారు.

అరుణకంటే ఏడాది చిన్నవాడైన చైతన్య ఇంజనీరింగ్ చదివి ఢిల్లీలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఆ తర్వాత అక్కడే తనతోపాటు పనిచేస్తున్న అమ్మాయినే ప్రేమించి, పెద్దల అంగీకారంతో, పెళ్లి చేసుకున్నాడు.

ఇక ఆ ఇంట్లో మిగిలింది వాసుదేవరావూ, సుగుణమ్మ. వాసుదేవరావు రిటైరయ్యాక అతనికి ప్రావిడెంట్‌ఫండ్ అవీ కలిపి అయిదు లక్షలొచ్చాయి. ఆపైన పెన్షన్ ఉండనే ఉంది. కొడుకు, కోడలు ఇద్దరూ ఉద్యోగస్తులే కనుక అడపా తడపా చైతన్య తల్లికి డబ్బు పంపుతూనే ఉంటాడు. అంచేత వాసుదేవరావుకి ఏ సమస్యా లేదు.

అయితే అతగాడికి కొరతగా అన్పించిందొక్కటే. పిల్లలు కుటుంబాలతో

వచ్చినప్పుడు ఇల్లు చిన్నదవడం వల్ల వాళ్ళకి వేరే పడక గదులు ఇప్పటి రోజులకి తగ్గట్టు ఏర్పాటు చేయలేకపోతున్నాడు. అందుకే అతనో నిశ్చయానికొచ్చాడు. తనకొచ్చిన డబ్బులో కొంత ఖర్చుపెట్టి మరో రెండు గదులు వేసి ఇంటిని అందంగా ఆధునిక వసతులతో తయారుచేయాలని. ఈ విషయంలో తనకు సరియైన సలహా ఇవ్వగల ఏకైక స్నేహితుడు రామచంద్రమూర్తిని కలిసి పరిస్థితిని వివరించాడు. అంతా విని, "దానికేముంది. తెల్సిన మేస్త్రీని పంపుతాను. అతనే నీకన్నీ చెబుతాడు" అంటూ తేల్చేసి ఆ మర్నాడే మేస్త్రీని పంపాడాయన.

తన ఆలోచనలు చెప్పి గదులు ఎక్కడ కడితే బావుంటుందో అడిగేడు వాసుదేవరావు అతగాడిని.

"బాబూ నాకు తెలవక అడుగుతానూ ఈ నైరుతిన బిల్డింగ్‌కి కట్ ఎందుకు పెట్టేరూ" అని అడిగేడతను.

"అక్కడ స్టోర్ రూం చిన్నది కదా. అందుకలా వచ్చింది. చెప్పేడు వాసుదేవరావు.

"ఏం లేదు బాబూ. తమరు మరోలా అనుకోకండి. మీకు జరుగుబాటు బాగానే అవుతోంది గదా" అడిగేడు మళ్ళీ.

వాడి బాధ అర్థమై ఓ చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు వాసుదేవరావు.

"అదీకాక ఎవరు చెప్పేరో మీకు గానీ... మేడ మీదికి మెట్లు ఆ దిక్కున ఉండకూడదు బాబూ. ఈ రెండూ మీకు చేటే. తొలుత అది సరిదిద్దాల. తర్వాత... గోడలు పాతవి కాబట్టి కోలములు యేస్కుని మేడమీది రెండు గదులు కట్టుకుంటే బావుంటాది. ఎలా లేదన్నా రెండు పట్టుకోవాలి" అన్నాడు.

"లక్షలేనా?" అడిగేడు వాసుదేవరావు.

"అవును. అదీ కనీస పక్షంగా. ఈలోగా సిమెంట్ ధరో, స్టీలు ధరో పెరిగితే ఇంకా పెరుగుద్ది ఖర్చు" అన్నాడు. అతగాడు వెళ్లేక,

"వాడి మొహం. వాడికేం తెలుసు. ఈ రోజుల్లో తాపీ పట్టుకోవడం రానివాళ్ళు కూడా పెద్ద తాపీ మేస్త్రీలుగా చెలామణీ అయిపోతున్నారు. వాస్తు గురించి మాట్లాడేస్తున్నారు. అనుభవమున్న ఒక ఇంజనీర్‌కి చూపిస్తే సరి" అంది సుగుణ.

ఈ మారు కంపెనీలో తనకు తెలిసిన ఓ సివిల్ ఇంజనీర్ని తీసుకొచ్చాడు వాసుదేవరావు.

ఇల్లంతా రెండుమార్లు తిరిగి చూసి, సుగుణ అందించిన కాఫీ తాగుతూ తీరుబడిగా తన అభిప్రాయాన్ని చెప్పేడాయన.

"ఇల్లు కట్టి ఇన్నేళ్ళయినా అప్పట్లో కల్తీ సిమెంట్, కల్తీ మనుషులు లేకపోవడం వల్ల దృఢంగా బాగానే ఉంది. మీరు కిందనున్నంత వాటానీ పైన వేసుకోవచ్చు. అయితే వాస్తు ప్రకారం చూస్తే నైరుతి మూసివేయాలంటారు. ఈశాన్యంలో మేడ మెట్లుండకూడదంటారు. గుమ్మాలు, కిటికీలు సరి సంఖ్యలో ఉండాలంటారు. మేడపైన గదులు వెయ్యదల్చుకుంటే ఇటువంటి తప్పులన్నీ సవరించుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో నాకంటే కూడా ఏ వాస్తు పండితుడినో అడగటం మంచిదని నా అభిప్రాయం."

వాసుదేవరావు తలూకెట్టేడు. అతను మాట్లాడకపోవడం చూసి సుగుణే అడిగింది. "మేడపైన కాకుండా రెండు గదులు క్రిందనే వేసుకోవడానికి వీలుండదంటారా?"

ఆ ప్రశ్నకు మరోమారు ఇంటి ప్లానును చూశాడతను.

"అప్పట్లో ఏదో చిన్న ఇల్లుగా కట్టేరు. ఇప్పుడు దాన్ని భూమ్మీద పెంచాలంటే కొంచెం కష్టమే. ఖర్చు కూడా ఎక్కువే అవుతుంది. తూర్పువైపు పునాదులు తీసి రెండు గదులు వేసుకోవచ్చు. వాటిని కలపటానికి గోడలు కొట్టాలి. ద్వారాలు అమర్చాలి. రాతి కట్టుకదా! ఇంతవరకూ ఏ పగుళ్లూ లేకుండా ఉంది. గోడలు కొట్టడం మొదలుపెడితే ఎలా ఉంటుందో చెప్పలేం. బిల్డింగ్ కూడా కొంచెం వీక్ అవొచ్చు. అదీగాక అటాచ్డ్ బాత్రూంలు కట్టేస్తే తూర్పున ఖాళీస్థలం తగ్గిపోతుంది. వాస్తు ప్రకారం అది ఒప్పుదు కదా?" అన్నాడాయన.

వాసుదేవరావు అప్పుడు పెదవి విప్పేడు.

"నిజానికి ఇది మేం కట్టించుకున్న ఇల్లు కాదు. పాతికేళ్ళ నాడు ఒకరి దగ్గర కొన్నది. అప్పట్లో ఇల్లు మాకు సరిపోతుందా లేదా, కంపెనీకి దగ్గరవునా కాదా, గదులూ గచ్చులూ బాగున్నాయా లేదా, గాలి వెలుతురూ ధారాళంగా వస్తున్నాయా లేదా, అనే విషయాలే ముఖ్యంగా చూసుకున్నాం. ఇప్పుడున్నంత వాస్తు స్పృహ జనంలో అప్పట్లో లేదేమో! అయినా ఈ ఇంటికొచ్చాక మాకు' అంతా బాగానే ఉంది" అన్నాడు.

"అందుకేగా నా పరిధిలో నేను చెప్పాల్సినది చెప్పాను. ఈ ఇల్లు మరో ఇరవై ఏళ్ళపైనే గ్యారంటీ. కాకపోతే కొట్టడం మొదలుపెడితేనే...." అంటూ ఆగిపోయాడు ఇంజనీరుగారు.

అంతా విన్నాక రామచంద్రమూర్తిగారు అన్నారు.

"నువ్వు బాగా ఆలోచించే ఒక నిర్ణయానికి రావడం మంచిదయ్యా వాసుదేవరావు. ఒకవేళ చేయించేదేమైనా ఉంటే అది సరైన వారిచేత చేయించడం అవసరం."

ఆ రాత్రి సుగుణ తన అభిప్రాయాన్ని బయటపెట్టింది.

"ఈ రోజుల్లో ప్రతివారూ వాస్తు గురించి చెప్పేవారే. ఈ ఇంజనీరుగారు తనకి తెలియని దాని జోలికి పోకుండా చక్కగానే చెప్పేరు. మన మట్టుకి మనకీ ఇల్లు బాగానే ఉందికదా! ఇక్కడికొచ్చాక పిల్లలు వృద్ధిలోకొచ్చారు. ఆర్థికంగా బాగానే ఉంది. అంచేత అందరూ చెప్పే చిన్న చిన్న వాస్తు దోషాలేమైనా ఉన్నప్పటికీ మీ వ్యక్తిగత జాతకం బాగుండబట్టి మనకు బాగుండి ఉండవచ్చు. మళ్ళీ ఇప్పుడు కొట్టడం, కట్టడం చేయాలనుకుంటే వారు చెప్పినట్లు ఒక వాస్తు పండితుడ్ని సంప్రదించాలి."

వాసుదేవరావు ఆమె చెప్పింది విని ఆలోచనలో పడ్డాడు. అలా ఓ వారం రోజులు ఆలోచనలో ఉన్నాడు. పగలంతా గ్రంథాలయంలోనే గడిపేవాడు. సుగుణ కూడా ఆ విషయమై మాట్లాడడం మానేసింది.

మరో వారం కూడా గడిచింది.

ఓ రోజు ఉదయం ఏడు గంటలకే ఇల్లు వదిలి బయటకు వెళ్లేడు వాసుదేవరావు. ఏ పది గంటలకో టిఫినూ, కాఫీ కానిచ్చి వెళ్ళే ఆయన ఇంత పెందరాళే ఎక్కడికా

అనుకుంది సుగుణ. కానీ ఎక్కడికీ అని అడగలేదు. ఆయన చెప్పనూ లేదు. పదిన్నర గంటల ప్రాంతంలో వచ్చేడు వాసుదేవరావు. ఆయన వెనుక మరొక అజానుబాహుడైన శాస్త్రీ కూడా ఉంది. ముందు గదిలోకి రాబోయే సుగుణ చటుక్కున వెనక్కి వెళ్ళిపోయింది.

ఆరడుగుల ఎత్తు మనిషి. ధృడంగా ఉన్నాడు. నుదుట విభూతి కట్లూ మధ్య ఎర్రటి పెద్ద బొట్టూ, మెడలో రుద్రాక్షలూ, ఎర్రటి సిల్కు పంచ, లాల్చీ, చేతిలో ఒకట్రెండు పుస్తకాలూ, ఓ చేతికర్రా.

ఆయనను ముందుగదిలో కూర్చోపెట్టి వంటింట్లోకి వచ్చి "నీలకంఠశాస్త్రి గారనీ" అంటూ ఆయనెవరో చెప్పేడు వాసుదేవరావు సుగుణతో.

"నయం. చెప్పేరు. హడలి చచ్చేను. ఏ భూతవైద్యుడో అనుకుని" అంది సుగుణ. వాసుదేవరావుకి నవ్వొచ్చింది. నవ్వకుండా ముందుగదిలోకొచ్చేశాడు.

ఇద్దరికీ మంచినీళ్ళందరిస్తూ, "మజ్జిగ పుచ్చుకుంటారా లేక కాఫీ ఇచ్చేదా" అంది సుగుణ.

గ్లాసెత్తి నీళ్ళన్నీ ఏకధారగా గొంతులో పోసేసుకుని, "ఏదైనా ఫర్వాలేదు. కాఫీయే ఇవ్వండి" అన్నాడు శాస్త్రిగారు.

మనిషికి తగ్గ గంభీరమైన గొంతాయనది. కాఫీ తెచ్చేలోగా ఇంటినంతా పరీక్షగా చూస్తూనే ఉన్నాడు.కాఫీ తాగేక "చూద్దాం పదండి" అంటూ లేచేడు. గదులు, వీధి, పెరడు, డాబా అన్నీ చూశాడు. చూసివచ్చి ముందుగదిలోకూర్చున్నాడు.

ఆయనేం చెబుతాడో అని సిద్ధంగా ఆయన కళ్ళలోకి చూస్తూ కూర్చున్నాడు వాసుదేవరావు.

"మొత్తం మీద మీ ఇల్లు వాస్తుకు విరుద్ధంగా ఉంది" అంటూ ఒకే ఒక ముక్కతో తేల్చేశాడు.

వాసుదేవరావేం మాట్లాడలేదు. సుగుణ ఆసక్తిగా చూస్తోంది.

"మీరు నిత్యం పడుకోవలసింది ఆ స్టోర్‌రూం ఉంది చూశారూ. అక్కడ" అన్నారాయన.

"స్టోర్‌రూంలోనా? గది చిన్నది గదా. మంచాలు గూడా పట్టవ్, పైగా కిటికీ కూడా పెద్దది లేదు దానికి" అంది సుగుణ వెంటనే.

"అక్కడంటే అదే స్టోర్‌రూంలో సామాన్ల మధ్య పడుకోమని కాదు నా ఉద్దేశ్యం. మీ పడక గది ఆ దిశన ఉండాలి. శాస్త్ర ప్రకారం యజమాని నైరుతి గదిలో పడుకోవాలి" అన్నారాయన.

వాసుదేవరావు ఏదోచెప్పబోయి ఆగిపోయాడు.

"రెండోది మీ వంటగది, అది ఉండాల్సిన స్థానంలో లేదు. వంటగది ఎప్పుడూ ఆగ్నేయ మూల ఉండాలి. అలా ఎందుకు కట్టలేదూ? ఇల్లు కట్టే ముందు సరైన సిద్ధాంతిని సంప్రదించరు. అంతా తమకే తెల్సుననుకుంటారు. అదే చిక్కు. మీరేగాదు చాలామంది అలాగే ఉన్నారు" అన్నారాయన.

"ఈ ఇల్లు మేం స్వంతంగా కట్టుకున్నది కాదు. పాతికేళ్ళ క్రితం చవగ్గా వస్తే

వేరే వారి దగ్గర్నుంచి కొనుక్కున్నాం" అన్నాడు వాసుదేవరావు.

"అద్దదీ అలా చెప్పండి. చవగ్గా ఇచ్చేశారందుకే. మీ మనస్తత్వాన్ని బట్టి మీరైతే అలా కట్టి ఉండరనే అనిపించింది సుమా" అన్నాడాయన మాట మారుస్తూ.

'ఆయన మనస్తత్వమేమిటో పెళ్ళయిన పదేళ్ళవరకూ నేనే కనిపెట్టలేకపోయాను. మీరపుడే కనిపెట్టేశారా మహాశయా' అనుకుంది సుగుణ మనసులోనే.

"వాయువ్యంలో వంటగది ఉంటే చుట్టాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వండి పెట్టలేక ఆవిడా, తెచ్చిపెట్టలేక మీరు నానా అవస్థలూ పడి వుంటారు" అన్నాడు.

"నిజం చెప్పాలంటే మాకు చుట్టాల తాకిడి తక్కువే. లేదనే చెప్పాలి" అంది సుగుణ.

ఈ మారు శాస్త్రిగారికి కోపమొచ్చింది.

అయినా తమాయించుకుని, "రెండుపక్కలా చుట్టాలూ పక్కాలూ లేక, వాళ్ళు రాకపోతే వాస్తు ఏం చేయలేదు. మా అమ్మా నాన్నే కదా, వాళ్ళు చుట్టాలెలా అవుతారని మీరనుకోవచ్చు. మా చెల్లీ తమ్ముడూ చుట్టాలు కారు కదా అని ఆయననుకోవచ్చు. ఇల్లాలు శ్రమపడుతుందన్నది శాస్త్రం. అది నమ్మకమున్నవాళ్ళు నమ్ముతారు" అన్నారు.

కాస్సేపు ఎవరూ ఏం మాట్లాడలేదు.

"అవునూ... ఆ నైరుతిని ఆఫ్‌సెట్ వచ్చినట్టు ఎందుకట్టేరూ?" అడిగేరాయన కాస్త స్థిమితపడి.

"మేం కట్టింది కాదు గదండీ. స్టోర్‌రూం మిగిలిన గదులంత ఉండనక్కర్లేదని బహుశ వాళ్ళు చిన్నది కట్టి ఉంటారు" అన్నాడు వాసుదేవరావు.

శాస్త్రిగారు లేచి, మరోమారు దక్షిణం వైపునున్న జాఫిరీ వరండాలోంచి బయటకు వెళ్లి పెరడు చూసేరు. వీధిలోకొచ్చిచ చెట్లనీ, ఈశాన్యం వైపునున్న మెట్లనీ చూశారు. తర్వాత వచ్చి కూర్చుని;

"మీరు మరోలా అనుకోనంటే ఉన్నది ఉన్నట్లు చెప్పేస్తాను. నేను శాస్త్ర విషయంలో నిఖచ్చయిన మనిషిని మరి" అన్నారు.

"చెప్పండి. లోటుపాట్లుంటే సలహాచెబుతారనేగా మీవంటి పెద్దల్ని సంప్రదించడం" అన్నాడు వాసుదేవరావు అతని కెదురుగా కూర్చుంటూ.

"ఈశాన్యం వైపు బరువులుండకూడదు. మేడపైకి వెళ్ళే మెట్లు మీ ఇంటికి ఈశాన్యంలోనే ఉన్నాయి. అవి తీసివేయాలి. వాటిని పెట్టుకోవడానికి ఆగ్నేయం ఒప్పుతుంది. పోతే, మామిడి, కొబ్బరిచెట్లు కూడా ఈశాన్యం వైపునే ఉన్నాయి. అవీ బరువుల కిందే లెక్క. ఆగ్నేయంలో పాలసపోటా వేసేరు. ఫల సంపంగీ, పారిజాతం ఉన్నాయి. పాలుగారే చెట్లు, సంపంగి, పారిజాతం లాంటి పూల చెట్లూ ఇంటి ఆవరణలో ఉండకూడదు. సెప్టిక్‌టాంక్ కూడా ఉండకూడని చోటే ఉంది. దాన్ని ఆగ్నేయంలోకి మార్చాలి"

వాసుదేవరావు ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

"అయినా నాలుగొందల గజాల స్థలమున్నప్పుడు పడమరని అంత జాగా

వదలమని ఎవరు చెప్పేరు? పడమర ప్రహరీ గోడకి బిల్డింగ్ ఎంత దగ్గరగా ఉంటే అంత మంచిది. బాత్రూములు కూడా ప్రహరీ గోడ పై నుండే కట్టేరు. జరిపి కట్టాలి" అన్నారు శాస్త్రిగారు.

సుగుణ లేచి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

వాసుదేవరావుకి ఆయన చెప్పేవేవీ వినపడ్డం మానేశాయి.

"కిటికీల సంఖ్య కూడా మీరు గమనించినట్లు లేదు. సరిసంఖ్య రావాలి. ప్రతిదానికీ జవాబులుండాలి. ఇవన్నీ నేను చెప్పినట్లు సరిచేయండి. మీ ఇబ్బందులన్నీ తొలగి మీ పిల్లలు వృద్ధిలోకొస్తారు. మీరు కట్టాల్సిన గదుల సంగతి అప్పుడు ఆలోచించి చెబుతాను" అంటూ ఆగేరు శాస్త్రిగారు.

వాసుదేవరావుకిప్పుడు సమయం చిక్కినట్లయింది. ఊపిరి పీల్చుకున్నాడు.

"మా క్షేమం కోసం మీరు మంచి సలహాలనే ఇచ్చేరు. అయితే నా సందేహాలను కూడా మీరు తీర్చాలి" అన్నాడు.

'విన్నవించుకో' అన్నట్లే చూసేరుగాని 'చెప్పండి' అన్లేదు శాస్త్రిగారు.

సుగుణ వంటింట్లోంచి వచ్చి కూర్చుంది.

వాసుదేవరావు మొదలుపెట్టేడు.

"మొదటిది మాకు చుట్టాల బెడద అట్టేలేదు. కాబట్టి వంటింటి దిశను మార్చనక్కర్లేదనుకుంటాను."

"సరే. మీ ఇష్టం" అన్నారాయన.

"మీరు బరువులేవీ ఉండకూడదనీ చెప్పిన మేడమెట్లు నిజానికి ఈశాన్యంలో లేవు. మయ బ్రహ్మచే చెప్పబడిన ప్రకారం స్థలం పొడవు వెడల్పులను తొమ్మిది భాగాలుగా చేసి ఈశాన్య దిక్కునున్న పొడవులో రెండు భాగాలు, వెడల్పులో రెండు భాగాలూ తీసుకుంటే ఆ మధ్యనున్న భూభాగమే ఈశాన్యమవుతుందంటారు. అలా తీసుకుంటే మా మెట్లు ఈశాన్యంలో లేవు. పోతే చెట్లంటారా. వాస్తు కోసం మనకి కాయల్నీ పళ్ళన్నీ పువ్వుల్నీ ఇస్తున్న చెట్లనీ మొక్కల్నీ నరికేయమని ఎక్కడా లేదనుకుంటాను. ఈశాన్యంలోగాని తూర్పునగాని పెద్ద పెద్ద వృక్షాలుంటే అవి సూర్యరశ్మిని ఇంట్లోకి రాకుండా చేయొచ్చని అలా చెప్పి ఉంటారనుకుంటాను. మా ఇంటికా ఇబ్బంది లేదు. పగలు ఎండ, రాత్రులు ఎంతో కొంత వెన్నెల మా ఇంట్లోకి వస్తాయి. మొదట్లో ఈ స్థలంలో మామిడితోట ఉండేదట. ఈ ఇల్లు కట్టినాయన ఈ స్థలాన్ని కొనేసరికి ఈ ఒక్క మామిడిచెట్టే ఈ స్థలంలో మిగిలిందట. శాస్త్రంలో చెప్పినదాని ప్రకారం ఫలవృక్షాలతో కూడిన భూమిలో ఇల్లు కట్టడం వల్లా, ఆ ఇంట్లో ఉండడం వల్ల అదృష్టవంతులైన సంతతీ, జీవితాభివృద్ధి ఉంటుందంటారు. దానిని కొట్టించేయవలసిన అవసరం నాకూ లేదు. ఈ చెట్టు ప్రతి యేడూ మా కుటుంబానికి సరిపడా కాయలిస్తోంది. పళ్ళిస్తోంది. పండక్కీ పబ్బానికీ శుభసూచకంగా గుమ్మానికి కట్టుకోవడానికి ఆకులిస్తోంది. ప్రతి ఉగాదికీ కమ్మని రాగాలను తీసే కోయిలల నాహ్వానిస్తోంది. అటువంటి ఏ అపకారమూ చేయని చెట్టును ఎలా కొట్టించేయడం? కొబ్బరి, మామిడి ఆవరణలో ఎక్కడున్నా శుభ ప్రదమేనని నేమాని

వారి గృహవాస్తులో చెప్పినట్లు గుర్తు. నన్నడిగితే చెట్లను నరకడం పాపమంటాను. ప్రకృతిలో అవీ మనవంటి ప్రాణులే అంటాను. విత్తు ఉంది. మొక్క ఉంది. ఎదుగుదల ఉంది. పుష్పించి ఫలించడం ఉంది. చివరికి చావూ ఉంది వాటికి."

శాస్త్రిగారేదో చెప్పబోతే, "నన్ను చెప్పనీయండి – తర్వాత నా సందేహాలన్నీ తీరుద్దురుగాని" అంటూ తను చెప్పాల్సింది కొనసాగించేడు వాసుదేవరావు.

'మాట కూడా మాట్లాడని ఆయనేనా ఈయన?' అన్నట్లు సుగుణ కూడా ఆశ్చర్యంగా అతని వంక చూడసాగింది.

"పోతే పారిజాతం నా ఇష్ట దేవునికి ప్రీతిపాత్రమైన పూలనిస్తుంది. సంపెంగ నా భార్య కిష్టం. అందుకే ఆ రెండూ మేం వేసుకున్నవే. సంపెంగకు పాములు జేర్తాయనీ, పారిజాతానికి గొంగళ్ళు పడతాయనీ అవి గృహ ఆవరణలో ఉంచనీరు. కానీ అవి నిషిద్ధాలు కావేమో! మీ వంటి వారే చెప్పాలి" అంటూ వాసుదేవరావు ఆగేడు.

వింటున్న శాస్త్రిగారు ముఖం ప్రశాంతంగా లేదు.

"ఇక పడకగది విషయానికొస్తే దక్షిణ గది మంచిదట. నైరుతి గది వాస్తుశాస్త్రం ప్రకారం ఆయుధ గది కదా! ఇంటికి నాలుగు వైపులా ద్వారాలుంటే ఎట్టి వాస్తు దోషాలూ ఆ ఇంటికి సోకవనీ ప్రాచీన వాస్తుశాస్త్రం చెబుతోందిట. తెలిసో తెలియకో ఈ ఇల్లు కట్టినాయన నాలుగు వైపులా గుమ్మాలు పెట్టించారు. ఇక మీరు ఇంటిని పడమటి గోడకు దగ్గరగా ఉండేట్టు కట్టాలన్నారు. కానీ సనత్‌కుమార్ సంహిత ప్రకారం స్థలం యొక్క పడమర దిశ నుండి తూర్పు దిశ వరకూ ఆరు సమాన భాగాలు చేసి మొదటిదైన పిశాచ భాగాన్ని విడిచిపెట్టి ఇల్లు కట్టుకోవాలట. దాని ప్రకారమే ఈ ఇల్లూ ఉంది. పోతే ఏ రకంగా చూసినా మీరు ఆఫ్‌సెట్ వచ్చిందన్న ఇంటి భాగం నిజానికి నైరుతిలో రానేలేదు. ఈ రోజుల్లో తెల్సి కొందరూ తెలియక కొందరూ వాస్తు చెబుతూనే ఉన్నారు. కొందరికి ఒప్పు అయినది ఇంకొందరికి తప్పు. అటువంటప్పుడు మా వంటి వారికి మీ వంటి శాస్త్రం తెల్సినవారే సంశయాలు తీర్చాలి" అంటూ ఆగేడు వాసుదేవరావు.

శాస్త్రిగారిలో కోపం కళ్ళలో కొచ్చింది.

"శాస్త్రం అగ్ని వంటిది. నిప్పును తెలిసి తాకినా, తెలియక తాకినా కాలక మానదు కదా. అన్ని శాస్త్రాలూ అందరూ పుస్తకాలు చదివి చెప్పేస్తే ఇక మేమెందుకూ? నేను చెప్పవలసింది నేను చెప్పేను. ఆ పైన మీ ఇష్టం" అంటూ లేచారాయన.

సుగుణ లోపలకు వెళ్లి గ్లాసుతో మజ్జిగ తెచ్చి ఆయన కందించింది. పుచ్చుకుని ఒక్క గుక్కలో తాగి, వాసుదేవరావు ఇచ్చిన నోట్లను లెక్కపెట్టుకుని సంచిలో ఉంచుకుని, "శాస్త్రంపై మీకు నమ్మకముండి చేయాలనుకుంటే చేయండి. సందేహాలుంటే రండి. చెబుతాను" అంటూ మరోమాటకు ఆస్కారమియ్యకుండా వెళ్ళిపోయారాయన.

ఆ తర్వాత కొన్ని రోజులు వాసుదేవరావుగాని, సుగుణ గాని ఆ విషయమై మళ్ళీ మాట్లాడుకోలేదు.

"రేపు ఉదయం ఎనిమిది గంటలకు మనం ఒక దగ్గరకు వెళ్ళాల్సి ఉంది.

పూజ తొందరగా కానిచ్చి ఏడున్నరకి రడీ అవు" అన్నాడు వాసుదేవరావు ముందురోజు రాత్రి పడుకోబోయే ముందు.

మర్నాడు ఉదయం కాస్త ముందుగానే లేచి ఏడుంపావుకే రడీ అయి కూర్చుంది సుగుణ. ఏడున్నర దాటేక బయటకొచ్చి ఆటో ఎక్కేరు.

"ఎక్కడికో ఏమిటో అడగలేదేం" అన్నాడు దార్లో వాసుదేవరావు.

"ఎందుకూ, మీరే చెబుతారుగా" అని ఊరుకుంది సుగుణ.

"వినాయకరావనీ... నాతో పనిచేసేవాడు. గుర్తుందా? మనింటికి కూడా రెండు మూడు మార్లు వచ్చాడు"

"అవును గుర్తులేకేం? నాలుగేళ్ళ క్రితం వాళ్లింటి గృహప్రవేశానికి కూడా మనం వెళ్ళేం" అంది సుగుణ.

"అతను రెండు రోజుల క్రితం బజార్లో కలిశాడు. వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాడట. వాళ్ళబ్బాయి అమెరికాలో ఆరేళ్లు పన్జేసి వచ్చి బెంగుళూర్‌లో సెటిల్ అయ్యేడు. కారు, ఇల్లు కొనుక్కున్నాడు. ఒక్కడే అబ్బాయి కదా వీళ్ళనీ అక్కడికే వచ్చి ఉండమని బలవంతం చేస్తున్నాడట. ఎలాగైతేనేం వెళ్లడానికే నిశ్చయించుకున్నారు. ఇల్లు అమ్మేస్తాడట. మంచి పార్టీ ఉంటే చూడమన్నాడు" అంటూ ఆగేడు.

"మనం ఇప్పుడా ఇల్లు చూడబోతున్నాం. అంతేగా" అంది సుగుణ.

"చూసి ఊర్కోడం కాదు. నచ్చితే కొనేసుకుంటాం కూడా" అన్నాడు వాసుదేవరావు.

ఆశ్చర్యంగా అతని వంక చూసింది సుగుణ.

"ఇల్లు ఊరికి సెంటర్లో ఉంది. అటు రైల్వేస్టేషనూ, ఇటు బస్టాండూ దగ్గర్లోనే ఉన్నాయి. ఆసుపత్రి, బజారు, బేంకూ నడిచి వెళ్ళే దూరంలోనే ఉన్నాయి. ఇల్లు కూడా కొత్తదే అనుకోవచ్చు. కాకపోతే స్థలమే మన దాన్లా నాలుగు వొందల గజాలు కాదు. ఆఫీషియల్ ఏరియాలో స్థలం ఖరీదు ఎక్కువ కాబట్టి రెండొందల గజాలే కొన్నాడు"

సుగుణ ఏం మాట్లాడలేదు. వాసుదేవరావు ఏ నిర్ణయమైనా బాగా ఆలోచించిగాని తీస్కోడు. అది ఆమెకు బాగా తెలుసు.

ఇల్లంతా రెండుమార్లు తిరిగి చూశారు సుగుణ, వాసుదేవరావు. రెండు బెడ్‌రూంలూ, కిచెనూ, హాలూ, అటాచ్డ్ బాత్రూం ఒకటీ, కామన్ బాత్‌రూం ఒకటీ, చిన్న స్టోర్‌రూం. గదులు చిన్నవైనా పొందిగ్గా కడప ఫ్లోరింగ్‌తో అందంగా వాస్తుకి అనుగుణంగా ఉంది. డాబా మీంచి చూస్తే ఊరంతా కనిపిస్తుంది. ఇంటికి ముందు, వెనకా కాస్త మట్టి జాగాలో పూలమొక్కలూ, పాదులూ ఉన్నాయి.

"ఇల్లెలా ఉంది" అడిగేడు వాసుదేవరావు ఇంటికి తిరిగొచ్చాక.

"బాగానే ఉంది. కానీ గదులు కాస్త చిన్నవి, స్థలం కూడా సగమే కదా" అంది సుగుణ.

"జీవితంలో కొన్ని అవసరాలు తీరాలనుకున్నప్పుడు మరికొన్ని వదులుకోక తప్పదు" అన్నాడు వాసుదేవరావు.

సుగుణ ఏం మాట్లాడలేదు.

"మనకైతే ఓ యాభై వేలు తగ్గిస్తానన్నాడు. మన ఇంటికి బేరం చూస్తానన్నాడు. ఎక్కువ స్థలం కావాలనుకున్నవారెవరో ఉన్నారట. ఎలా చూసినా నాలుగు లక్షలు వస్తుంది మన ఇంటికి. దానిపైన మరో ఒకటిన్నర లక్షలు పెడితే చాలు. మనక్కావలసిన మరో బెడ్‌రూం, కొన్ని సదుపాయాలు అమరుతాయి. ఈ పాత ఇంటిని బాగుచేసుకునే కంటే కొత్త ఇంట్లోకి మారితేనే మంచిదనిపిస్తోంది.

"మీ యిష్టం" అంది సుగుణ.

ఆర్నెలలో అన్నీ చకచకా జరిగిపోయాయి. అట్టే శ్రమ పడకుండానే వాసుదేవరావు ఇంటికి బేరం కుదరడం, అతను వినాయకరావు ఇల్లు కొనుక్కుని మారడం జరిగిపోయాయి.

గోడలకి కొత్తగా డిస్టెంపర్లూ, తలుపులకు రంగులూ వేయించుకుని మారారేమో... కడప రాళ్ళ నేలా, మెరిసిపోయే గోడలు, చుట్టుపక్కల సందడీ, అటాచ్డ్ బాత్రూంల సదుపాయం, వంటింట్లో అలమార్లు, కుకింగ్ స్లాబ్‌ల అమరిక సుగుణకు కూడా 'నష్టపోయిందేమీలేదు' అనుకునేలా చేశాయి.

గృహప్రవేశానికి రాకపోయినా ఏడాదిలోనే కూతురూ, అల్లుడూ, ఢిల్లీ నుండి కొడుకు, కోడలూ వేరు వేరుగానే వచ్చి ఉండి వెళ్ళారు. 'ఇల్లు సదుపాయంగా ఉంది. మంచి పనే చేశారు' అని మెచ్చుకున్నారు. దాంతో వాసుదేవరావు పూర్తిగా సంతృప్తి పడ్డాడు.

ఓ రోజు పాత స్నేహితుడు రామచంద్రరావు ఎలా ఉన్నాడో చూడాలనిపించి బయల్దేరాడు వాసుదేవరావు. ఇల్లు అమ్మేశాక మళ్ళీ అటువైపు వెళ్లలేదు. తాపీగా రిక్షాలో వెళ్తూ తను అన్నేళ్ళు నివసించిన ఆ ఇంటివైపు కుతూహలంతో చూశాడు. గోడలకు రంగులు వేయడం వల్ల కాస్త కొత్తగా ఉంది. ఇంటి ముందు చెట్లు, మేడ మీదికి మెట్లు అలాగే ఉన్నాయి. ప్రహారీకి పెద్ద గేటు మాత్రం కొత్తగా వచ్చింది. గేటుకి ఒకవైపు ఇంటి నెంబరు, మరోవైపు యజమాని పేరూ పాలరాతి మీద చెక్కించి ఉంచారు. రిక్షా దాటిపోతుండగా నేమ్‌బోర్డు మీద పేరు చూశాడు వాసుదేవరావు. 'వాస్తు పండిట్ శ్రీనివాసరావు' అని ఉంది దాని మీద.

వాసుదేవరావుకి ఆశ్చర్యమనిపించింది. ఆ సంగతే రామచంద్రమూర్తితో అంటే "నీ దగ్గర ఈ ఇల్లు కొన్నాయన ఈయనకు బావమరిదిట. ఆయన దగ్గర తీసుకున్నాడు ఈయన. ఈ మధ్యే పరిచయమయ్యేడు. మంచివాడు" అన్నాడతడు.

"మరి... ఇంటి వాస్తూ... చెట్లూ, మెట్లూ..." వాసుదేవరావుకి వచ్చిన సందేహమేమిటో అర్థమైంది రామచంద్రమూర్తికి.

"యజమాని జాతకం బాగుండాలనేగాని చిన్న చిన్న వాస్తు దోషాలు... ముఖ్యంగా పెద్ద పట్టణాల్లో ఏంచేయవట. తనకు మాత్రం అంతా బాగానే ఉందన్నాడు" చెప్పేడు రామచంద్రమూర్తి.

వాసుదేవరావు మరేం మాట్లాడలేదు.

'అవును. అంతా బాగానే ఉంది మరి!' అనుకున్నాడు.

● *ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 24 నవంబరు, 2001*